మన ఊరు-మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పనులకు సంబంధించి దాదాపు రూ.10 కోట్ల బిల్లులు ఏడాదికిపైగా రాకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు తీసుకొచ్చి పనులు చేపట్టామని.. వాటికి వడ్డీలు చెల్లించలేని పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు చేపట్టే క్రమంలో వెంటబడి చేయించిన అధికారులు.. పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోమంటే చేతులెత్తేస్తున్నారని వాపోతున్నారు. కాగా.. కాంగ్రెస్ సర్కార్ అమ్మ ఆదర్శ పాఠశాలల పనులకు వెనువెంటనే నిధులను విడుదల చేస్తూ.. 'మన ఊరు-మన బడి' నిధుల విడుదలలో జాప్యం చేయడం తగదని.. ఆ నిధులను కూడా త్వరగా మంజూరు చేసి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

-పరిగి, నవంబర్ 7


నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I | హైదరాబాద్, శుక్రవారం 8 నవంబర్ 2024 | VIKARABAD




గుడి మల్కాపూర్‌లోని శివ్‌బాగ్ మెట్ల బావి(ఫైల్)

## 'మన ఊరు-మన బడి' కింద పాఠశాలలకు మరమ్మతులు

# బడి బకాయిలు ఏమాయె..?

- పనులు పూర్తైనా మంజూరు కాని నిధులు
- రూ.10 కోట్లు పెండింగ్.. పట్టించుకోని కాంగ్రెస్ సర్కార్
- అమ్మ ఆదర్శ పాఠశాలల పనులకు వెనువెంటనే నిధులు
- నిధుల విడుదలలో సర్కారు పక్షపాత వైఖరి
- జాప్యం తగదు : కాంట్రాక్టర్లు

వికారాబాద్ జిల్లాలో 1,024 ప్రభుత్వ పాఠశాలలుండగా 2022-23 విద్యా సంవత్సరంలో మన ఊరు-మన బడి కార్యక్రమం కింద మౌలిక వసతులు కల్పించేందుకు 371 స్కూళ్లను అధికారులు ఎంపిక చేశారు. నీటి పారుదల, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, మిషన్ భగీరథ, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ, ఇంజినీరింగ్ శాఖల ద్వారా వాటి పర్యవేక్షణ చేపట్టారు. జిల్లాలోని 106 పాఠశాలల్లో మన ఊరు-మన బడి పనులు పూర్తయ్యాయి. 38 పాఠశాలల్లో పనులు వివిధ దశల్లో ఉండగా వాటిని సైతం ఇంజినీరింగ్ అధికారులు వెంటపడి మరీ పూర్తి చేయించారు. మిగతా వాటికి సంబంధించి మంచినీటి వ్యవస్థ, విద్యుద్దీకరణకు సంబంధించిన వైరింగ్, ఇతర పనులు, డైనింగ్‌హాళ్ల నిర్మాణం, కంప్యూటర్ ల్యాబ్‌లు, మైనర్, మేజర్ రిపేర్ వర్క్స్ చేపట్టారు. పనులు పూర్తైన పాఠశాలల్లో మరుగుదొడ్లు, ప్రహరీలు, కిచెన్‌షెడ్లను ఉపాధిహామీ పథకం నిధులతో చేపట్టారు. కాగా జిల్లాలో పూర్తైన పనుల విలువ రూ.18 కోట్లు ఉండగా.. వాటిలో రూ.8 కోట్లు బిల్లులు మంజూరు కాగా.. రూ. 10 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బిల్లుల విషయమై కాంగ్రెస్ సర్కారు గత పదకొండు నెలలుగా పెదవి విప్పకపోవడం, నిధులు కేటాయించకపోవడంతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



గ్రీనరీ, సకల వసతులతో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా మారిన కాళ్లాపూర్ పాఠశాల

### అమ్మ ఆదర్శ పాఠశాలల పనులకు నిధులు..

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట జిల్లాలోని 954 పాఠశాలల్లో వివిధ పనులను చేపట్టి.. వాటికి సంబంధించిన బిల్లులను సకాలంలో చెల్లించడం గమనార్హం. 782 పాఠశాలలకు సంబంధించిన పనులు పూర్తై ఎంబీ రికార్డు సైతం చేపట్టగా రూ.17 కోట్లు విలువ చేసే పనులకు బిల్లులు చెల్లించినట్లు సమాచారం. ఎంబీ రికార్డులు కావాల్సినవి సుమారు రూ. 2 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు ఉంటాయని సమాచారం. డీఎంఎఫ్‌టీ, ఇతర నిధుల ద్వారా వాటి బిల్లులను చెల్లించిన ప్రభుత్వం మన ఊరు-మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పనులకు మాత్రం బిల్లులను విడుదల చేయకపోవడం విడ్డూరం. 'మన ఊరు-మన బడి' పనులకు తమ వద్ద డబ్బుల్లేకుంటే కుటుంబ సభ్యుల బంగారు ఆభరణాలను బ్యాంకుల్లో తనఖా పెట్టి డబ్బులు తెచ్చామని, మరి కొందరు వ్యాపారుల దగ్గర వడ్డీకి తీసుకొచ్చి పనులు చేయించారని.. ఆ అప్పులకు వడ్డీలు చెల్లించలేని పరిస్థితి నెలకొన్నదని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఇటీవల పరిగిలో కాంట్రాక్టర్లు మెడలో ఉరితాళ్లు వేసుకొని నిరసన తెలిపారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి కార్పొరేట్ బడులకు దీటుగా తీర్చిదిద్దేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం మన ఊరు-మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే.**

### అప్పులు తెచ్చి పనులు చేపట్టా..

మన ఊరు-మన బడి కార్యక్రమం కింద ఎంపికైన అయినాపూర్ ఉన్నత పాఠశాలలో రూ.10 లక్షలతో మౌలిక వసతులు కల్పించా. కాగా ఏఈ రూ. 7 లక్షల పనులకే ఎంబీ రికార్డులు చేసి మిగతా రూ. 3 లక్షల పనులకు ఎంబీ చేయలేదు. చేసిన పనులకు డబ్బులు రాగానే మిగిలిన పనులను పూర్తి చేద్దామనుకున్నా. కానీ, ఇప్పటివరకు రూపాయీ రాలేదు. మరమ్మతులకు వెచ్చించిన మొత్తం కూడా ఇతరుల వద్ద అప్పుగా తెచ్చా. వాటికి వడ్డీ చెల్లించలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నా. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బకాయిలు చెల్లించి ఆదుకోవాలి.

**- పొట్ట సాయిలు, అయినాపూర్ ఉన్నత పాఠశాల చైర్మన్, దోమ**



## నగర ఖ్యాతిని విస్మరించి

### హెరిటేజ్ కట్టడాలను పట్టించుకోని హెచ్ఎండీఏ

- గతంలోనే 12 మెట్ల బావులు, భవనాల పునరుద్ధరణ
- అభివృద్ధికి నోచుకోని 60కిపైగా పురాతన కట్టడాలు

**ఘనమైన చరిత్ర కలిగిన హైదరాబాద్ నగరంలో చారిత్రక కట్టడాలు, నిర్మాణాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. గతంలో వారసత్వ సంపదగా గుర్తించి ఆధునీకరించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టిన హెచ్ఎండీఏ.. ఇప్పుడు వాటిని విస్మరిస్తున్నది. నగరంలో వందకు పైగా కట్టడాలు, నిర్మాణాలు, భవనాలు, చేద, మెట్ల బావులు ఉండగా, ఇందులో ఇప్పటికే 12 కట్టడాలను హెచ్ఎండీఏ గుర్తించి.. ఆధునీకరించింది. అయితే మిగిలిన 60కిపైగా పురాతన కట్టడాల అభివృద్ధిని పక్కన పెట్టేసింది. దీంతో భావితరాలకు చారిత్రక మూలాలను అందించే కట్టడాలు శిథిలావస్థకు చేరుతున్నాయి.**

**- సిటీబ్యూరో, నవంబర్ 7(నమస్తే తెలంగాణ)**

#### పెండింగ్ పనులూ పూర్తి చేయలేదు..

నిజానికి హైదరాబాద్ వ్యాప్తంగా 100కు పైగా హెరిటేజ్ కట్టడాలు ఉన్నాయి. హైదరాబాద్ పరిధిలో గతంలోనే పలు ప్రాజెక్టుల కింద పలు నిర్మాణాలను అభివృద్ధి చేశారు. ఈ క్రమంలో మరో 60-70కి పైగా కట్టడాలను ఇప్పటికే గుర్తించి నివేదికలు సిద్ధం చేశారు. టూంబ్స్, మినార్లు, చేద, మెట్ల బావులను అభివృద్ధి చేయాల్సి ఉన్నది. కానీ, హెచ్ఎండీఏ అధికారులు , ప్రభుత్వ యంత్రాంగం కానీ, ఇప్పటివరకు ఆ దిశగా ఒక్క అడుగూ వేయలేదు. కనీసం పెండింగ్‌లో ఉన్న పనులను కూడా పూర్తి చేయలేదు.

#### పూర్వ వైభవం తీసుకొచ్చిన బీఆర్ఎస్ సర్కారు

చారిత్రక కట్టడాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆధునీకరించి..పూర్వ వైభవం తీసుకొచ్చింది. అప్పటి సర్కారు ఆదేశాలతో హెచ్ఎండీఏ అధికారులు 12 కట్టడాలు, మెట్ల బావులు, నిర్మాణాలు, భవనాలను ఆధునీకరించారు. గుడిమల్కాపూర్‌లోని శివ్‌బాగ్, భగవాన్‌దాస్ మెట్ల బావులు, లంగర్ హౌస్‌లోని కటోరాహౌస్, గచ్చిబౌలిలోని మెట్ల బావి, సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోమ్, బుద్ధభవన్ సమీపంలోని సైదానీమా టూంబ్స్ వంటి శిథిలావస్థకు చేరిన నిర్మాణాలను గుర్తించి చర్యలు చేపట్టారు. వీటిని ఆధునీకరించి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దారు.



ఉత్తరాది రాష్ట్రాల భక్తులతో కలిసి ఛాట్ పూజలో పాల్గొన్న మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని మతాలకు సమ ప్రాధాన్యమిచ్చిందన్నారు. -కొత్తూరు, నవంబర్ 7



నిరసన తెలుపుతున్న స్ట్రీట్ వెండర్స్

### కుమారి ఆంటీకో న్యాయం..

## మాకో న్యాయమా..?

### నాలెడ్జ్ సిటీ స్ట్రీట్ వెండర్స్ ఆవేదన

కొండాపూర్ : 'ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేసుకుంటున్న కుమారి ఆంటీకో న్యాయం... అదే స్ట్రీట్‌లపై వ్యాపారం చేసుకుంటున్న మాకో న్యాయమా'..? అంటూ నాలెడ్జ్ సిటీలోని ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసుకుంటున్న స్ట్రీట్ వెండర్స్ ఆందోళనకు దిగారు. ఎలాంటి సమాచారమివ్వకుండా టీజీఐఐఎస్, ట్రాఫిక్ పోలీసులు దౌర్జన్యంగా తమ స్టాళ్లను తొలగించడంతో గురువారం నిరసన తెలిపారు. ట్రాఫిక్‌కు ఇబ్బందుల్లేకుండా సాఫ్ట్‌వేర్ సంస్థలకు దూరంగా బతుకుదెరువు కోసం స్టాళ్లను ఏర్పాటు చేసుకున్న తమపై దౌర్జన్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన చేపట్టారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగేలా, అత్యవసర సమయంలో కనీసం అంబులెన్స్‌లు సైతం వెళ్లలేని పరిస్థితిని కల్పిస్తున్న కుమారి ఆంటీ స్టాల్ వైపు మాత్రం కన్నెత్తి చూడని అధికారులు.. తమపై చర్యలు తీసుకోవడం ఎంతవరకు సమంజసమంటూ ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫుట్‌పాత్ స్టాళ్ల వైపు వెళ్లొద్దని, వారి వ్యాపారాలకు ఇబ్బందులు కలిగించొద్దని చెప్పినా.. టీజీఐఐఎస్ అధికారులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి స్టాళ్లు నడుపుతున్న వారిపై చూడని అధికారులు, స్థానికులమైన తమపై కక్షపూరితంగా వ్యవహరించడం వెనకాల కారణాలేమింటో తెలుపాలన్నారు. స్టాళ్ల తొలగింపుతో వాటిపై ఆధారపడి జీవిస్తున్న 100 కుటుంబాలు రోడ్డున పడ్డాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

## ఎమ్మార్పీ కంటే అధికంగా..


సిటీబ్యూరో, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్న ఔషధాలను డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు సీజ్ చేశారు. డీసీఏ అధికారుల కథనం ప్రకారం.. గాజులరామారం పరిధిలోని అలీప్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న 'మెడ్జిన్ లైఫ్ సైన్సెస్' ఫార్మా కంపెనీ తయారు చేస్తున్న మపిరోసిన్ ఆయింట్‌మెంట్‌ను ఎమ్మార్పీ కంటే రూ. 30.37కు అధికంగా విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు అధిక ధరలకు విక్రయిస్తున్న ఆయింట్‌మెంట్ ట్యూబ్స్‌ను సీజ్ చేసి, తయారీ కంపెనీకి నోటీసులు జారీ చేసినట్లు డీసీఏ డీజీ వీబీ కమలాసన్‌రెడ్డి వెల్లడించారు.

# పచ్చని పొలాల్లో ఫార్మా వద్దే..వద్దు


**భూములే.. మా జీవనాధారం. అవి లేకుంటే మేము ఎలా బతకాలి.. ఎక్కడికెళ్లాలని దుద్యాల ప్రాంత ఫార్మా భూ బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సారవంతమైన భూములు.. ఆశించిన మేర పంటలతో సంతోషంగా బతుకుతున్నామని..తమ భూముల్లో ఫార్మా విలేజ్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలియడంతో గత ఎనిమిది నెలలుగా నిద్ర లేని రాత్రులు గడుపుతున్నామని కన్నీటి పర్యంతమవుతున్నారు. కాలుష్య కారక ఫార్మా కంపెనీలకు తమ భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వబోమని, సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ తమ పోరాటం ఆగదని స్పష్టం చేస్తున్నారు. ఇక్కడ ఫార్మా కంపెనీలు వద్దే..వద్దని ఎంత మొత్తుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, డ్రోన్‌ల ద్వారా రహస్యంగా సర్వేలు చేయిస్తూ ఆందోళనకు గురి చేస్తున్నదని మండిపడుతున్నారు.**

**-కొడంగల్, నవంబర్ 4**

- గత ఎనిమిది నెలలుగా నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం
- కాలుష్య కారక కంపెనీలను రానివ్వం
- అవసరమైతే ప్రభుత్వంతో పోరాడుతాం..
- మాకు భూములే జీవనాధారం.. అవి లేకుంటే మా బతుకులు శూన్యమే..
- స్పష్టం చేస్తున్న దుద్యాల ప్రాంత ఫార్మా భూబాధిత రైతులు



పులిచెర్లకుంట తండా (ఫైల్)



గిరిజనుల భూములపై సర్కారు కన్నేసిందని..వాటిని లాక్కోవాలని చూస్తున్నదని పలువురు మండిపడుతున్నారు. దుద్యాల మండలంలోని రోటిబండతండా, పులిచెర్లకుంట తండాల్లో దాదాపుగా 102 గిరిజన కుటుంబాలుండగా 450 వరకు జనాభా ఉన్నది. ఇక్కడ తాము చదును చేసి, సాగు చేసుకుని జీవిస్తున్న భూములను తీసుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ ఫార్మా కంపెనీలకు ఇవ్వబోమని.. అవసరమైతే సర్కార్‌తో పోరాడుతామని వారు తేల్చిచెబుతున్నారు. తమ బతుకులు బాగుచేస్తారని రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే ..సీఎం అయిన ఆయన ఫార్మాకంపెనీలను తీసుకొచ్చి తమ బతుకులను ఆగం చేయాలని చూస్తున్నారని మండిపడుతున్నారు.

### మొత్తం కాలుష్యమయం అవుతుంది..

రోటిబండతండా, పులిచెర్లకుంట తండాల్లో అసైన్డ్ ల్యాండ్ 80 ఎకరాలు మాత్రమే ఉండగా.. ఫార్మా కంపెనీల ఏర్పాటుకు ఆ 80 ఎకరాల భూమితోపాటు గిరిజనులకు సంబంధించిన 500 ఎకరాలను ప్రభుత్వం లాక్కునేందుకు యత్నిస్తున్నదని గిరిజన రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో భూముల ధర ఎకరానికి రూ.70 నుంచి రూ. కోటి వరకు పలుకుతున్నా.. ఏ ఒక్క గిరిజన రైతు కూడా తమ భూములను విక్రయించేందుకు సిద్ధంగా లేరంటే ..ఆ పొలాలపై వారికి ఎంత మక్కువ ఉందో ప్రభుత్వం ఒక్కసారి గుర్తించాలని సూచిస్తున్నారు. పైన పేర్కొన్న రెండు తండాలతోపాటు దుద్యాల, లగచర్ల, ఈర్లపల్లి గ్రామాల్లో ప్రభుత్వ భూమి 252 ఎకరాలు మాత్రమే ఉందని.. ఫార్మా విలేజ్ ఏర్పాటుకు ప్రభుత్వం 1,375 ఎకరాలు సేకరిస్తున్నదని...అంటే ఈ లెక్కన దాదాపుగా వెయ్యి ఎకరాలకు పైగా పట్టా భూమిని ఫార్మా విలేజ్ కబళిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాతల కాలం నుంచి వస్తున్న భూములు, తమ కష్టార్జితంతో ఎకరం, రెండెకరాల భూములను కొనుగోలు చేసి తమ పిల్లలకు కాకుండా ప్రభుత్వానికి ఇవ్వాలని పేర్కొనడం తగదని..తమ పొలాలను సర్కారుకు ఇస్తే తమ సంతానం ఎలా జీవించాలని ప్రశ్నిస్తున్నారు. ఫార్మా కంపెనీలొస్తే ఈ ప్రాంతం మొత్తం కాలుష్యమయం అవుతుందని, అప్పుడు మనుషులతోపాటు పశువులు కూడా జీవించలేని పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.


### రూ. కోట్ల విలువైన భూములు..రూ. 10లక్షలకేనా..?



ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఎకరానికి రూ.70 లక్షల నుంచి రూ. కోటి వరకు పలుకుతున్నది. ప్రభుత్వం రూ.పది లక్షలు, 125 గజాల ఇంటి స్థలం, ఇంటికో ఉద్యోగం ఇస్తాం.. భూములు ఇవ్వమంటే ఎలా..?. అయినా తాము భూములు అమ్ముకునేందుకు సిద్ధంగా లేము. భూములను నమ్ముకునే తాతల కాలం నుంచి బతుకుతున్నాం. వ్యవసాయం తప్ప వేరే వృత్తి తెలియదు.

**-పాండ్యానాయక్, ఫార్మా భూబాధిత రైతు, పులిచెర్లకుంటతండా, దుద్యాల**

### రేవంత్‌రెడ్డి.. మా బతుకులను రోడ్డు పాలు జేస్తున్నారు..



అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డిని గెలిపించేందుకు మహారాష్ట్రలో ఉన్న ఈ ప్రాంత వలస కూలీలైన గిరిజనుల ఓట్లను వేయించా. ఆయన విజయం కోసం నిద్రాహారాలు మాని కష్టపడ్డా. కానీ, ఆయన సీఎం అయిన తర్వాత మా బతుకులనే రోడ్డు పాలు చేయాలని చూస్తున్నారు. **-విఠల్‌నాయక్, ఫార్మా భూబాధిత రైతు, పులిచెర్లకుంట తండా, దుద్యాల**

### ప్రభుత్వం వినడం లేదు..



ఫార్మా కంపెనీలు వద్దే..వద్దని ఎంత మొత్తుకుంటున్నా, వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మా కున్న ఎకరం, రెండు ఎకరాల భూములు ఫార్మాకు పోతే, మేం ఎలా బతకాలి. భూములు ఇవ్వాలని మీటింగ్‌లు పెట్టి మాకు ఆశపెడుతున్నారు. మేము మాత్రం మా భూములను ఫార్మా విలేజ్‌కు ఇచ్చే ప్రసక్తేలేదు.

**-సోమ్లానాయక్, ఫార్మా భూ బాధిత రైతు, పులిచెర్లకుంట తండా, దుద్యాల**

### భూములే.. మా జీవనాధారం

పనికి రాని బీడు భూములు, గుట్టలు, జనాలు లేని ప్రాంతాల్లో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయాలి. పచ్చటి పంటలు పండే పట్టా భూములను తీసుకొని, కాలుష్యకారక కంపెనీలను ఏర్పాటు చేస్తామనడం విడ్డూరంగా ఉన్నది. మా తాతల నుంచి భూములపైనే ఆధారపడి జీవిస్తున్నాం. మా జీవనాధారం భూములే.. వాటిని వదిలి మేము జీవించలేం. **-గోపాల్‌నాయక్, ఫార్మా భూ బాధిత రైతు, పులిచెర్లకుంట తండా, దుద్యాల**

